## 'నీ స్నేహం కోసం' కథల సంపుటి ఆవిష్కరణ

'నీ స్నేహం కోసం' కథల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జూన్ 30 : తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో కామన్ డయాస్ (సాహిత్యం– విద్య–సేవ, జర్నలిజం, రవ్వలకొండ విశ్వబ్రాహ్మణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తంగెళ్లపల్లి కనకాచారి రచించిన 'నీ స్నేహం కోసం' కథల సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుడు రుద్రశంకర్ విచ్చేసి కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని హైమావతి భీమన్నకు అంకితం చేశారు. అనంతరం రచయితలను అభినందించారు. ప్రతిభా పురస్కారాలను అందుకున్న వారి ప్రతిభను ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్.చారి, శైలజా మిత్ర, దైవజ్ఞశర్మ, రాగరంజని, లలితావాణి తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళలపై వివక్ష చూపకుండా చూడాలి

బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

సుల్తాన్‌బజార్,జూన్ 30 : ఒంటరి మహిళలపై వివక్ష చూపకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పూలే ఫౌండేషన్ సలహాదారులు ఎం. సూర్యనారాయణ అన్నారు. ఆదివారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంఘిక దురాచారాలు, స్త్రీల హక్కులు అనే అంశంపై ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రమీల అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీ హైకోర్టు అడ్వకేట్ జీవీఎస్ లక్ష్మీ తులసి, ఈఎస్ఐ అనస్తీషియా డాక్టర్ కే సంధ్య, కొండురు దేవి, బీసీ ఫ్రంట్ నాయకులు నారగోని, డాక్టర్ రామ్‌నరసయ్యలతో కలిసి మాట్లాడుతూ.. శుభ కార్యాల్లో వితంతు భాగాస్వామ్యాన్ని అపశకునంగా భావించకుండా ప్రతి స్త్రీని మంగళకరంగా భావించి వాయనం ఇచ్చి పుచ్చు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓ మహిళకు వాయనం అందజేశారు. బీసీ సాధికారత భవన్ ఇన్‌చార్జి ఇంద్రగంటి రమేశ్‌తో పాటు పెద్దెత్తున మహిళలు పాల్గొన్నారు.

# బడిలోకి పోయేదెలా?

- జమిస్తాన్‌పూర్ పాఠశాల చుట్టూ అక్రమ పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ముషీరాబాద్, జూన్ 30: రాంనగర్ జెడ్‌బీగార్డెన్ రోడ్డులో వాహనాల అక్రమ పార్కింగ్‌తో స్థానికులు, పాఠశాల విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాలలోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

**గతంలో పలు మార్లు అడ్డుకట్ట వేసినా..**

గతంలో పలు మార్లు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేసిశారు. అయిన ప్పటికీ కొన్ని రోజులు గడువగానే యథాస్థితిని కొనసాగిస్తున్నారు.

పాఠశాల భవనం పొడవునా అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

దీంతో పలువురు ప్రజా ప్రతినిధులు ట్రాఫిక్ పోలీసుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

**స్థానికంగా ఉండే వారితోనే ఇబ్బంది..**

స్థానికంగా ఉండే కొందరు వాహనదారులు ఏకంగా గేటు ముందరే పార్కింగ్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదే విషయమై పాఠశాల అధ్యాపకులు పలు మార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే తాత్కాలిక పరిష్కారం మినహా శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

## నేడు విద్యార్థులకు బహుమతులు పంపిణీ..

తెలుగు యూనివర్సిటీ, జూన్ 30 : శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భారతపూర్వ ప్రధాని పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా జులై 1న సోమవారం సాయంత్రం వ్యాస రచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతుల పంపిణీ జరుగుతుందని భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉదయవర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

## పురస్కారాల ప్రదానం..

పురస్కారగ్రహీతలతో.. మధుసూదన్‌రావు

ముషీరాబాద్, జూన్ 30: పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 30 మంది కవులచే సమాజంలో వైద్యుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనం విశేషంగా ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో విశ్రాంత జస్టిస్ బూర్గుల మధుసూదన్ రావు ముఖ్యతిథిగా పాల్గొని పలువురు వైద్యులకు వైద్యరత్న, సేవారత్న పురస్కారాలను అందజేసి సత్కరించారు. డాక్టర్ ఎస్‌పీ భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకుడు కె. మురళీమోహన్‌రాజు, ఎస్. వేణుగోపాల శర్మ, మహేశ్‌చంద్ర, చల్లా మాధవిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకుసుమ, మహేశ్వరరావు పాల్గొన్నారు.

## గోల్కొండ బోనాలకు రావాలని గవర్నర్‌కు ఆహ్వానం

గోల్కొండలో జూలై 7నుంచి జరుగనున్న ఆషాఢ బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణణ్‌కు ఉత్సవ సమితి సభ్యులు భగవంత్‌రావు, రాహుల్ స్వాగత్, రాజు ఉస్తాద్, సాయిబాబాచారి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. – మెహిదీపట్నం

## అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు

అంకిత భావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్‌యాదవ్ అన్నారు. కాచిగూడ ఆర్టీసీ డిపోలో మెకనికాల్‌గా ఉద్యోగ విరమణ చేసిన పీఎన్ వేణుగోపాల్‌ను ఆదివారం నెహ్రూనగర్‌లో ఉద్యోగులు

పాల్గొని వేణుగోపాల్‌ను సన్మానించారు. మరికంటి కృష్ణంరాజు, కాలేరు రామకృష్ణ, కాలేరు రాజు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జూన్ 30

## నృత్య కళారూపాలను పరిరక్షించుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 30 : నటరాజ్ నృత్య నికేతన్, శ్రీలలిత కళా నృత్య నికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో భారతీయ సంగీత నృత్యోత్సవం– 12 శంభో శివ శంభో పేరట సంగీత నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కవి విశ్లేషకులు చినుకు పి.ఎన్. మూర్తి, నటరాజ్ నిత్య నికేతన్ వ్యవస్థాపక నాట్య గురువులు జట్ల చిన్న వీరభద్రరావు, డాక్టర్ అరవ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళారూపాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొదటి రోజు 300 మంది, రెండవ రోజు 175 మంది సంగీత నృత్య కళాకారులు, చక్కటి ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి అస్థాన గురువులు ఘంటసాల పవన్ కుమార్, సీనియర్ జర్నలిస్టు డి.సుమన్, వి. నాగబాబు, ప్రముఖ నాట్యాచార్యులు శ్రీ తాతా వెంకట వరప్రసాద్, నాట్యగురువులు లాస్య రంజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్య గురువులను సన్మానించారు.

కళాకారుల నృత్య ప్రదర్శన




## కార్యకర్తల కృషితోనే విజయం

కాచిగూడ, జూన్ 30: సికింద్రాబాద్ పార్లమెంటరీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల సమష్టి కృషితోనే విజయం సాధించినట్లు కేంద్ర బోగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. వచ్చే ఐదేండ్లు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, కార్పొరేటర్లు ఉమాయాదవ్, అమృత, మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఆనంద్‌గౌడ్, చంద్రశేఖర్, అజయ్‌కుమార్, రమేశ్‌యాదవ్, నందకిశోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

## ఆత్మీయ సన్మానం..

చిక్కడపల్లి ఎస్సైగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కోటేశ్వరరావును ఆదివారం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎరుకొండ సీతయ్య సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై నాగరాజు ఎస్సైలు, సిబ్బంది, కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి

శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో పూజరిగా విధులు నిర్వహించిన బుచ్చిమాచార్యులు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హాజరై బుచ్చిమాచార్యులను సన్మానించారు. – చిక్కడపల్లి

## గోవిందునగర్ అభివృద్ధికి తనవంతు సహకారం



కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసిన గోవిందునగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ

అంబర్‌పేట, జూన్ 30: గోవిందునగర్ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గోల్నాక డివిజన్ గోవిందునగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఇటీవల ఎన్నికైంది. ఆ కమిటీ ప్రతినిధులు ఆదివారం కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం చైర్మన్ కంబర్తి ప్రభాకర్, అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావు యాదవ్, ఉపాధ్యక్షులు బి.ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి కుయ్య అరుణ్‌దాస్, సంయుక్త కార్యదర్శి సెట్ల గోపాల్, కోశాధికారి సెట్ల మురళీ, కార్యవర్గ సభ్యులు బద్దుల చంద్రకాంత్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బోనాల ఇన్‌చార్జులుగా భూపతి లక్ష్మన్, రాజేశ్

లక్ష్మన్, రాజేశ్‌లను సన్మానిస్తున్న బస్తీపెద్దలు

అంబర్‌పేట, జూన్ 30: గోల్నాక డివిజన్ శాంతినగర్ అమ్మవారి బోనాల జాతర భూపతి లక్ష్మన్, ఎం.రాజేశ్‌ల ఆధ్వర్యంలో జరుగుతుందని బస్తీ అధ్యక్షుడు ఎస్.భద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.మహేశ్ తెలిపారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో బస్తీ పెద్దలంతా వీరిని ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈ సందర్భంగా ఇద్దరిని బస్తీపెద్దలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్.భద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.మహేశ్, రంగుల వేణు, రెడపాక రాము, భూపతి రాము, రంగుల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు సంఘటితంగా ఉంటే రాజ్యాధికారం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ తిరుమలి

ఖైరతాబాద్, జూన్ 30: బీసీలు సంఘటితంగా ఉంటే రాజ్యాధికారం సొంతమవుతుందని ఢిల్లీ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి అన్నారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల్లో మార్పు వచ్చినప్పుడే అధికారం వారి చేతిలోకి వస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లోనైనా బీసీలు పోటీలో నిలవాలని, గెలుపోటములతో సంబంధం లేకుండా సమాజాన్ని మార్చగలిగే శక్తులుగా ఎదగాలన్నారు. బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా బీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కోటపై ఏర్పాట్లు

బోనాలు అంటే టక్కున గుర్తు కొచ్చేది గోల్కొండ బోనాలు. అంత ప్రాచుర్యం పొందింది గోల్కొండ కోట. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ మాస బోనాలకు గోల్కొండ కోట ముస్తాబవుతున్నది. దానిలో భాగంగా జూలై మొదటి ఆదివారం నుంచి ప్రారంభం కానున్న బోనాల వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. – మెహిదీపట్నం

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, జూన్ 30 : రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం చివర్లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నీలి రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిమ్స్‌లో కోలుకున్న చెంచు మహిళ

ఖైరతాబాద్, జూన్ 30: నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మూలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ కోలుకున్నారు. ఆదివారం వైద్యులు ఆమెను డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, దయాల జితేందర్ బాధితురాలిని పరామర్శించారు.

# చంద్రసేనగుప్తా సేవలు మరువలేనివి



కోఠిలోని ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం కార్యాలయం వద్ద వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేనగుప్తా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తదితరులు

సుల్తాన్‌బజార్, జూన్ 30 : ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలతో లక్షలాది మందికి కొత్త జీవితాలను అందిస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రసేనగుప్తా (కేసీ గుప్తా) సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కోఠిలోని సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేసీ గుప్తా విగ్రహాన్ని ఆయన సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1939లో కామారెడ్డిలో జన్మించిన కేసీ గుప్తా 1940లో ఇసామియా బజార్‌కు వచ్చారని అన్నారు. ఇక్కడే డిగ్రీ పూర్తి చేసిన ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. వాసవీ క్లబ్బును స్థాపించి అనేక సేవా కార్య క్రమాలను నిర్వహించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నేటి తరం ఆర్యవైశ్యులు కేసీ గుప్తాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్‌ఫౌండ్రి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాశ్‌బీష్వ, వాసవీ సేవా కేంద్రం జీవిత సలహా దారులు అశోక్ కుమార్, నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్, ఇసామియా బజార్ ఆర్య వైశ్య సంఘం కోశాధికారి ఎర్రం లక్ష్మణ్, సభ్యులు ఏ రవికుమార్, అశోక్‌తో పాటు ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైష్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవాలు

అబిడ్స్, జూన్ 30 : గోవాలో జనజాగృతి సమితి నిర్వహించిన వైష్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవ వేడుకలలో గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసింగ్ తన కుమారుడు టి చంద్రశేఖర్‌సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి రాజాసింగ్‌ను జనజాగృతి సమితి ప్రతినిధులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కొంత మంది రాజకీయ నాయకులు తమ పిల్లలను కమ్యూనిటీ కారణాలలో నిమగ్నం చేయకుండా నిరుత్సాహ పరుస్తున్న కాలంలో తన కుమారున్ని హిందూ హక్కుల ప్రయత్నాన్ని ముందుకు తీసుకు వెళ్లడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది రాజకీయ నాయకులు బలమైన హిందూ నాయకులుగా నటిస్తున్నారని, ఎన్నికలలో గెలిచిన వెంటనే సెక్యులర్ వ్యక్తులుగా రూపాంతరం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల తరువాత సెక్యులర్‌గా మారే వారు హిందూ రాష్ట్ర డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నారని మండి పడ్డారు. ప్రస్తుతం యాభై మంది దృఢమైన హిందూ ఎంపీలను ఎన్నుకోవడం అత్యవసరమన్నారు.

గోవాలో జరిగిన వైష్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌ను సన్మానిస్తున్న జనజాగృతి సమితి ప్రతినిధులు

**హిందూ రాష్ట్ర సాధనకు పాటు పడుతా..**

తన తండ్రి అడుగు జాడలో నడిచి హిందూ రాష్ట్ర సాధనకు పాటు పడుతానని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ తనయుడు చంద్రశేఖర్‌సింగ్ అన్నారు. గోవాలో జనజాగృతి సమితి నిర్వహించిన వైష్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే రాజాసింగ్, చంద్రశేఖర్‌సింగ్‌ను పరిచయం చేసిన సందర్భంగా చంద్రశేఖర్‌సింగ్ ప్రసంగించారు. హిందూ రాష్ట్ర స్థాపనకు ప్రతి హిందువు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మోయినుద్దీన్ ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈ శ్యాంసుందర్‌కు సూచించగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. – మెహిదీపట్నం

## ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని కె.ఎస్.కె. ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ప్రారంభించి, వైద్యశిబిరాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

– మెహిదీపట్నం

## వీసీల నియామకాల్లో 50 శాతం బీసీలకు అవకాశమివ్వాలి

కాచిగూడ, జూన్ 30: రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు వీసీల నియామకాల్లో 50 శాతం బీసీలకు అవకాశమిచ్చి, బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో బీసీలకు 50 శాతం కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. ఆదివారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్నట్లు బీసీ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల నియామకాల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం